సచివాలయంలో వాస్తు మార్పులు ముమ్మరం?

- ఈశాన్యం గేటు నుంచి సీఎం రేవంత్‌రెడ్డి రాకపోకలు
- వెనుక గేటు వద్ద దుకాణాల తొలిగింపునకు ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి కోసం సచివాలయంలో వాస్తు మార్పులు వేగంగా జరుగుతున్నట్టు సమాచారం. తూర్పు వైపున్న ప్రధాన గేటును ఇప్పటికే మూసివేశారు. కాగా.. పశ్చిమం వైపు (వెనుక) గేటు వద్ద మరమ్మతులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ఈశాన్యం వైపున్న గేటు నుంచి రాకపోకలు సాగించారు. ఇకపై ఈ గేటు నుంచి సీఎస్, డీజీపీ, మంత్రులు మాత్రమే రాకపోకలు సాగించాలని ఆదేశాలు జారీచేసినట్టు తెలిసింది. మిగతా ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఇతర ఉన్నతాధికారులు, వీఐపీలను ఆగ్నేయంవైపున్న గేటుకు పరిమితం చేయాలని సూచించినట్టు సమాచారం. సాధారణ ప్రజలు సైతం ఇదే గేటు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఇక.. సచివాలయం వెనుక గేటువైపు సీఎం వచ్చే మార్గానికి సమీపంలో ఉన్న చాయ్ దుకాణాలను, ఇతర చిరువ్యాపారుల దుకాణాలను తొలగించాలని ఇప్పటికే అధికారులు ఆదేశించినట్టు తెలిసింది. దీంతో వారు ప్రత్యామ్నాయ స్థలం వెతుక్కోవాల్సి వస్తున్నది.

తాగునీటి కోసం మహిళల రాస్తారోకో

మెదక్ జిల్లా చిన్నశంకరంపేట పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో మూడు, నాలుగు రోజుల నుంచి తాగునీరు రావడం లేదని మహిళలు ఆగ్రహించారు. ఖాళీ బిందెలతో మంగళవారం మెదక్ చేగుంట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు రోజుల నుంచి కాలనీకి నీళ్లు రావడంలేదని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, తాగునీటి కోసం వ్యవసాయ బోరుబావులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొన్నదని మండిపడ్డారు. కాలనీలో బోరు మోటర్ కాలిపోయి 15 రోజులు గడుస్తున్నా దానికి మరమ్మతులు చేయించడం లేదని చెప్పారు. మంచినీటి సమస్యను పరిష్కరించే వరకు రాస్తారోకోను విరమించేది లేదని చెప్పారు. ఎంపీడీవో దామోదర్ సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. ట్యాంకర్‌ల ద్వారా నీళ్లను సరఫరా చేస్తామని, కాలిపోయిన బోరు మోటర్‌ను బాగు చేయిస్తామని చెప్పడంతో మహిళలు ఆందోళన విరమించారు. – చిన్నశంకరంపేట

గనుల తవ్వకాలకు వార్షిక క్యాలెండర్

- డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు

హైదరాబాద్, జూన్11(నమస్తే తెలంగాణ): ఇసుక సహా వివిధ గనుల తవ్వకాలకు వార్షిక క్యాలెండర్ రూపొందించి టెండర్లు పిలువాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గతంలో కన్నా ఎక్కువ ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించాలని ఆయన కోరారు. మంగళవారం సచివాలయంలో ఆయన గనుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇసుక రీచ్‌లను ఆయా ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు కేటాయిస్తే ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే అవకాశం ఉంటుందా? అనే అంశంపై సమగ్ర సర్వే నిర్వహించాలని గనుల శాఖ అధికారులను డిప్యూటీ సీఎం కోరారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ హరిత, స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిలింసిటీలో రామోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల

రామోజీకి సీఎం రేవంత్‌రెడ్డి నివాళి

- కుటుంబ సభ్యులకు పరామర్శ

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు కుటుంబ సభ్యులను సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం రామోజీ ఫిల్మ్‌సిటీకి వెళ్లిన ఆయన రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. సీఎం వెంట మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, మల్‌రెడ్డి రాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు ప్రదీప్ కుమార్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ చిత్రా రామచంద్రన్ మర్యాదపూర్వకంగా కలిశారు. రెరా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని వారికి సీఎం సూచించారు. ఎమ్మెల్సీ తీన్మార్‌మల్లన్న కూడా సీఎంని మర్యాపూర్వకంగా కలిశారు. అనంతరం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో శిక్షణ పొందుతున్న తెలంగాణ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్-2023 బ్యాచ్ అసిస్టెంట్ కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు.

విద్యార్థులకు ఒక జత చొప్పున యూనిఫాం

- మహిళా సంఘాలకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి సీతక్క

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): సర్కారు స్కూళ్లలోని విద్యార్థులకు అందజేసే యూనిఫాంలు 90శాతం సిద్ధమైనట్టు ప్రభుత్వం ప్రకటించింది. బడులు పునఃప్రారంభమయ్యే బుధవారం విద్యార్థులకు జత యూనిఫాం చొప్పున అందజేస్తామని వెల్లడించింది. రాష్ట్రంలోని 15,30,603 మంది విద్యార్థులకు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులంతా యూనిఫాంలు అందజేస్తారని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. యూనిఫాంలు కుట్టించే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించామని, దీంట్లో భాగస్వామ్యమైన వారందరికి మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారని పేర్కొంది. యూనిఫాంల కుట్టుకూలీ చార్జీలను రూ.50 నుంచి రూ.75కు పెంచామని ప్రకటించింది.

విద్యార్థులకు సమస్యల స్వాగతం

- నేటి నుంచి బడుల పున ః ప్రారంభం
- స్కావెంజర్ల నియామకమేదీ ?
- ఆచరణకు నోచుకోని సీఎం హామీ
- ప్రశ్నార్థకంగా పారిశుద్ధ్య నిర్వహణ

నిజామాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఇంకా పూర్తికాని మరమ్మతులు

క్యాటగిరీ	మంజూరు	ఖాళీలు
గెజిటెడ్ హెచ్‌ఎం	4,424	2,037
ఎల్ఎఫ్ఎల్ హెచ్	4,203	2,164
ఎస్‌జీటీలు	57,890	7,082
స్కూల్ అసిస్టెంటు	44,520	7,790
భాషాపండితులు	0,838	846
పీఈటీలు	2,956	410
వొకేషనల్ ఇతర	1,227	970
మొత్తం	1,25,058	21,299

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని బడులు బుధవారం నుంచి పునఃప్రారంభంకానున్నాయి. 2024-25 నూతన విద్యాసంవత్సరం ప్రారంభంకానుండగా, సర్కారు బడులు సమస్యలతో విద్యార్థులను స్వాగతించనున్నాయి. ముఖ్యంగా బడులను ఊడ్చేవారు.. కడిగేవారు కరువయ్యారు. దీంతో పారిశుద్ధ్యం ప్రశ్నార్థకంగా మారింది. సర్కారు బడుల్లో స్కావెంజర్లను నియమిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో హామీనిచ్చారు. కానీ, ఈ హామీ కార్యరూపం దాల్చలేదు. దీంతో టీచర్లు స్థానికంగా ఉన్నవారికి పురమాయించి ఊడ్పడం, కడిగించడం చేయించాల్సి వచ్చింది. పాఠశాలల్లో వసతులు కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరుతో మరమ్మతులను సర్కారు మహిళా సంఘాలకు అప్పగించింది. కలెక్టర్ల ద్వారా దాదాపు వెయ్యికోట్లకు వరకు నిధులను కేటాయించింది. బడుల్లో పనులింకా పూర్తికాలేదు.

పరిస్థితులిలా..

- రాష్ట్రంలో సొంత భవనాలు లేని బడులు 696 ఉన్నాయి. వీటిలో 239 అద్దెభవనాల్లో నడుస్తున్నాయి. మరో 264 బడులను అద్దె లేకుండా నడిపిస్తున్నారు. మరో 34 పాఠశాలలు ఇతర శాఖలకు చెందిన భవనాల్లో నిర్వహిస్తున్నారు.
- రాష్ట్రంలోని 1042 బడుల్లో తాగేందుకు నీళ్లు లేవు.
- 4,761 బాలురు, 1,707 బాలికలకు టాయిలెట్లు నిర్మించాల్సి ఉన్నది.
- 1,616 బడులకు విద్యుత్తు కనెక్షన్లు లేవు.
- 7,472 బడులకు ప్రహరీలు లేవు.
- దివ్యాంగ విద్యార్థుల కోసం 5,408 బడుల్లో ర్యాంపులు లేవు.
- ఆటస్థలాలు లేని బడులు 9,370 ఉన్నాయి. మధ్యాహ్న భోజనం వండేందుకు కిచెన్‌షెడ్లు లేని స్కూళ్లు 11,115 ఉన్నాయి.

పోస్టులకు తగ్గట్లు టీచర్లేరి..

రాష్ట్రంలో పోస్టులకు తగ్గట్టు టీచర్లు లేరు. మొత్తం 1. 25 లక్షల టీచర్ పోస్టులుండగా, తాజా గణాంకాల ప్రకారం 21వేల పైచిలుకు టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గత మార్చి నుంచి రాష్ట్రంలో టీచర్ల రిటైర్మెంట్లు ప్రారంభమయ్యాయి. దీంతో ఖాళీల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నది. 11వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ పోస్టులు భర్తీకి మరో మూడు నెలలకు పైగా సమయం పట్టే అవకాశం ఉన్నది. టీచర్ల కొరత సమస్యను తీర్చేందుకు విద్యావలంటీర్లను నియమించాల్సి ఉండగా, విద్యావలంటీర్లను తీసుకోబోమని ఇటీవలే విద్యాశాఖ ప్రకటించింది. పలు పాఠశాలల్లో బోధనేతర పోస్టులు కూడా ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. 26వేల బడులకు 4,164 మంది బోధనేతర సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారు. అటెండర్ల సంఖ్య కేవలం 2,036 మాత్రమే.

అటు బడిబాట.. ఇటు బదిలీల బాట

రాష్ట్రంలో జీరో విద్యార్థులున్న బడులు 1,739 ఉండగా, 1 నుంచి 10 మంది విద్యార్థులున్న బడులు 2,229 ఉన్నాయి. ఇక నమోదు పెంచేందుకు ఏటా నిర్వహించే బడిబాటను ప్రభుత్వం ఈ సారి ప్రారంభించింది. అటు బడిబాటను నిర్వహిస్తుండగానే మరోవైపు బదిలీలకు తెరలేపింది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ షురూ కాగా టీచర్లంతా ఇదే పనిలో బిజీగా ఉన్నారు. దీంతో పరిస్థితి గందరగోళంగా తయారైంది. దీని ప్రభావం పిల్లల నమోదుపై పడుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఆహారం కల్తీ చేస్తే కఠిన చర్యలు

- హోటల్స్ అసోసియేషన్ల సమావేశంలో మంత్రి దామోదర

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): ఆహారం కల్తీ చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. మంగళవారం సచివాలయంలో 'రాష్ట్ర ప్రభుత్వం - కమిషనర్ ఫుడ్ సేఫ్టీ' ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి దామోదర మాట్లాడుతూ... హైదరాబాద్ బిర్యానీకి అంతర్జాతీయ గుర్తింపు ఉన్నదని చెప్పారు. హోటళ్ల యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. సమావేశంలో ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్ డాక్టర్ శివలీల, తెలంగాణ స్టేట్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, ఇండియన్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సందీప్, సుల్తాన్ మస్కతి, తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్ల ప్రారంభానికి ఏర్పాట్లు చేయండి

- టీజీఎంఆర్ఈఐఎస్ వైస్ చైర్మన్ ఫహీముద్దీన్ ఖురేషి

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతుండడంతో పిల్లల కోసం బడుల్లో అన్ని పనులను పూర్తి చేయాలని మైనారిటీ గురుకుల ప్రిన్సిపాళ్లను తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీజీఎంఆర్ఈఐఎస్) వైస్ చైర్మన్ మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి ఆదేశించారు. మంగళవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో మైనారిటీ గురుకులాల ప్రిన్సిపాళ్లతో బడుల పున:ప్రారంభ ఏర్పాట్లపై సమీక్షించారు. పదో తరగతి, ఇంటర్‌లో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్కూళ్లను సందర్శించి, బాధితుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. కార్యక్రమంలో సీఎం సెక్రటరీ షానవాజ్ కాసీం, మైనారిటీ గురుకులాల సొసైటీ సెక్రటరీ పాల్గొన్నారు.

'నాసా' కాన్ఫరెన్స్‌లో శ్రీచైతన్య జయకేతనం

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ స్థాయిలో నాసా నిర్వహించిన ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్ (ఐఎస్‌డీసీ)లో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు జయకేతనం ఎగురవేసినట్టు అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. 30 దేశాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు కాన్ఫరెన్స్‌కు హాజరు కాగా, శ్రీచైతన్య విద్యా సంస్థల నుంచి 167 మంది పాల్గొన్నట్టు వెల్లడించారు. స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌కు దేశం నుంచి 28వేల మంది విద్యార్థులు పాల్గొనగా, 639 మంది శ్రీచైతన్య విద్యార్థుల భాగస్వామ్యంతో 62 ప్రాజెక్ట్‌లు ఉత్తమమైనవిగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 7 ప్రాజెక్ట్‌లు మొదటి స్థానంలో, 11 ప్రాజెక్ట్‌లు రెండో స్థానంలో, 15 ప్రాజెక్టులు మూడో స్థానంలో నిలువగా, 29 ప్రాజెక్టులు మెమెంటోలు సాధించాయని తెలిపారు. తమ విద్యార్థి ప్రపంచంలోనే 500 డాలర్ల బహుమతి అందుకున్న ఏకైక విద్యార్థిగా నిలిచినట్టు వెల్లడించారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- టమాట కిలో 50.. కొత్తిమీర కట్ట 10
- ఘాటెక్కిన ఉల్లి.. మండుతున్న మిర్చి
- అధిక ఉష్ణోగ్రతలతో తగ్గిన దిగుబడి
- మరో నెల రోజులు ఇదే పరిస్థితి
- కొత్త పంట మార్కెట్‌కు వస్తేనే ధరలు తగ్గుముఖం అంటున్న వ్యాపారులు

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): మార్కెట్ కూరగాయల ధరలు మండిపోతున్నాయి. వాటిని కొనాలంటేనే సామాన్యుడు హడలెత్తిపోతున్నాడు. నిన్నమొన్నటి వరకు కాస్త పరవాలేదు అనుకున్న ఉల్లి ధర కూడా ఇప్పుడు ఘాటెక్కింది. రిటైల్ మార్కెట్‌లో కేజీ ఉల్లి ధర రూ.40 నుంచి రూ.45 వరకు పలుకుతున్నది. మహారాష్ట్ర మార్కెట్ నుంచి దిగుమతులు తగ్గడమే ధర పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు తెలిపారు. తెలంగాణలోని మలక్‌పేట్, ఏపీలోని తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌కు దేశవ్యాప్తంగా ఫేమస్. ఈ మార్కెట్‌లకు షోలాపూర్, నాసిక్, పుణె, అహ్మద్‌నగర్ ప్రాంతాల నుంచి నిత్యం కనీసం 450 టన్నుల వరకు ఉల్లి దిగుమతి అవుతుంది. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లోని పలు మార్కెట్లకు తరలుతుంది. ఈ మార్కెట్‌కు ప్రస్తుతం రోజుకు 240 టన్నుల ఉల్లి మాత్రమే వస్తుండటం వల్ల వారంరోజులుగా ఉల్లి ధరల్లో మార్పులు వచ్చాయి. వారం క్రితం రిటైల్ మార్కెట్‌లో కేజీ రూ.20 నుంచి రూ.30 వరకు పలికిన కేజీ ఉల్లి.. ఇప్పుడు రూ.50 నుంచి రూ.60కి చేరాయి. వారం క్రితం నాసి రకం ఉల్లి రూ.100కు మూడు కిలోలు విక్రయిస్తుండగా.. ప్రస్తుతం దుకాణాల వద్ద నాణ్యత తక్కువగా ఉన్న వాటిని కిలో రూ.40 నుంచి రూ.45 వరకు అమ్ముతున్నారు. పైగా త్వరలో బక్రీద్ పండగ ఉండటంతో డిమాండ్ అంతకంత పెరుగుతుంది. డిమాండ్, సరఫరా మధ్య అంతరం ఏర్పడటం వల్ల ధరలు పెరిగాయని మార్కెట్ ట్రేడర్లు చెప్పారు.

ప్రతికూరగాయ ధర 10 పెరిగింది

కూరగాయల ధరలు పెరుగుదలపై ఎర్రగడ్డ రైతు బజార్ ఈవో రమేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వర్షాకాలంలో కొత్త పంట వేయడంతో.. ఆ తేడా కూరగాయల ధరల్లో కనిపిస్తున్నదని తెలిపారు. ప్రతి కూరగాయలోనూ 10 రూపాయల పెరుగుదల కనిపిస్తున్నట్టు పేర్కొన్నారు. వివిధ జిల్లాల్లో రాష్ట్రాల నుంచి దిగుబడి తక్కువగా ఉండటంతో కూడా కూరగాయల ధరలు పెరిగాయని, ట్రాన్స్ పోర్ట్ ఖర్చులు కూడా పెరిగిపోవడంతో ఆ భారం కూడా కూరగాయల రేట్లపై పడిందని వెల్లడించారు. పెరిగిన ధరలు నెలరోజులపాటు కొనసాగే అవకాశం ఉన్నట్టు ఈవో చెప్పారు.

ఎర్రగడ్డ రైతు బజార్‌లో కూరగాయల రేట్లు

కిలో	గతంలో	ఇప్పుడు
వంకాయ	20	40
బెండకాయ	24	60
బీరకాయ	30	50
టమాటా	20	50
కొత్తిమీర కట్ట	05	10
ఉల్లిగడ్డలు	25	40
బీన్స్	80	120
పచ్చిమిర్చి	40	80
ఆలుగడ్డ	30	50
దొండకాయ	20	60
దోసకాయ	40	60
కాకరకాయ	40	60
క్యారెట్	40	60

మళ్లీ ఉల్లి ఘాటు

- 15 రోజుల్లో 50% పెరిగిన ధరలు

న్యూఢిల్లీ, జూన్ 11: ఎన్నికల ముందు వరకు అదుపులో ఉన్న ఉల్లిగడ్డల ధరలు మళ్లీ కొండెక్కుతున్నాయి. కొద్ది రోజుల్లో రాబోతున్న బక్రీద్ వల్ల వీటికి డిమాండ్ పెరిగినట్టు పేర్కొంటున్నారు. గత రెండు వారాలుగా వీటి ధరలు 30 నుంచి 50 శాతం పెరిగాయి. ఇటీవల వరకు కేంద్రం తీసుకున్న కొన్ని చర్యల కారణంగా ఉల్లిగడ్డల ధరలు అదుపులో ఉన్నాయి. అయితే వాటిని సడలిస్తుందన్న ఆశతో కొందరు వ్యాపారులు పెద్దయెత్తున స్టాక్‌ను నిలువచేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఎకనమిక్స్ టైమ్స్ పేర్కొంది. మహారాష్ట్రలోని నాసిక్ ఉల్లి మార్కెట్‌లో సోమవారం సాధారణ రకం ఉల్లిగడ్డలు కిలో ధర రూ.26 ఉంది. ఇదే ఉల్లిగడ్డల ధర మే 25న రూ.17 ఉంది. అదే నాణ్యమైన ఉల్లి కిలో రూ.30 వరకు అమ్ముతున్నారు. ఇప్పటివరకు ఉల్లి ఎగుమతులపై కేంద్రం విధిస్తున్న సుంకాలను త్వరలోనే రద్దు చేస్తుందన్న వార్తలతో వ్యాపారులు ఉల్లిని పెద్దయెత్తున నిల్వ ఉంచడంతో డిమాండ్‌కు సప్లయికి మధ్య వ్యత్యాసం పెరిగి ధరలు పెరుగుతున్నాయని కొందరు ఆర్థిక నిపుణులు తెలిపారు.

యాక్సిడెంట్ నాటకంతో ఫోన్ల చోరీ

మిర్యాలగూడ, జూన్ 11: నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బైక్ మీద నుంచి కింద పడిపోయినట్టు నటిస్తూ.. సాయం చేసేందుకు వచ్చిన వారి ఖరీదైన సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. ఇలా మంగళవారం ఒక్కరోజే ఐదు చోట్ల ఫోన్లను తస్కరించారు. మిర్యాలగూడలోని హెచ్‌పీ గ్యాస్ డీలర్ ప్రతాప్.. కోటక్ మహీంద్ర బ్యాంక్ వద్దకు వచ్చాడు. బ్యాంక్ సమీపంలో ఓ యువకుడు బైక్ పైనుంచి కిందపడ్డాడు. ప్రతాప్ వెంటనే అతడిని పైకి లేపేందుకు వెళ్లగా.. మరో యువకుడు వచ్చి అతను తమవాడేనని ప్రతాప్ జేబులోని ఐఫోన్‌ను దొంగిలించాడు. బైక్ లేపాక ఇద్దరూ కలిసి అదే బైక్‌పై పారిపోయారు. ప్రతాప్ బ్యాంక్‌లోకి వెళ్లి జేబులో ఫోన్ కనిపించకపోవడంతో కంగతిన్నాడు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో ఇదే తరహాలో ఇద్దరు యువకులు మిర్యాలగూడ మండలం రాయినిపాలెం గ్రామానికి చెందిన మోర కృష్ణ సెల్‌ఫోన్‌ను దొంగిలించారు. ఇలా నలుగురి నుంచి ఫోన్లు కొట్టేసిన గుర్తు తెలియని యువకులు.. పట్టణంలోని ఖలీల్‌దాబా సమీపంలో ఫోన్ మాట్లాడుతూ రోడ్డు వెంట నడిచి వెళ్తున్న కిశోర్ నుంచి సెల్‌ఫోన్‌ను లాక్కొని బైక్‌పై పరారయ్యారు. దీంతో బాధితులు తమ ఫోన్లను గుర్తుతెలియని దొంగలు కొట్టేసినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాహన తనిఖీల టార్గెట్లు పూర్తిచేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): జిల్లాల్లో వాహనాల తనిఖీ టార్గెట్లను పూర్తి చేయాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం రవాణాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి మాట్లాడారు. రవాణాశాఖ కార్యాలయాలకు సొంత భవనాలకు భూములను గుర్తించాలని సూచించారు. రవాణా శాఖ వాహనాలను ఒకే గూటికి తీసుకొచ్చేలా స్టిక్కరింగ్ ఉండేలా చూసుకోవాలని కోరారు.విద్యాసంస్థల వాహనాలు ఫిట్‌నెస్ ఉంటేనే రోడ్డెక్కేలా చూడాలని ఆదేశించారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో స్పెషల్ సెక్రటరీ విజయేంద్ర బోయి, రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు ప్రవీణ్, రమేశ్, మమత తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న పైసల పంచాయితీ

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూట్యూబర్‌కు రూ.40 లక్షలు అందజేత
- కాంగ్రెస్ కౌన్సిలర్లు, నేతలకు పంచినట్టుగా చెప్తున్న యూట్యూబర్
- కౌన్సిలర్లు, నేతల పేర్లతో సోషల్ మీడియాలో జాబితా చక్కర్లు
- డబ్బులు ఇవ్వకుండానే బదనాం చేస్తున్నారని కౌన్సిలర్ల ఆగ్రహం
- యూట్యూబర్‌పై నల్లగొండ టూటౌన్ పీఎస్‌లో ఫిర్యాదు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన స్టేషన్ వీడియోలు

నల్లగొండ ప్రతినిధి, జూన్ 11 (నమస్తే తెలంగాణ): వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉపఎన్నికల్లో తీన్మార్ మల్లన్న పైసల పంపిణీ నల్లగొండ కాంగ్రెస్‌ను కుదిపేస్తున్నది. ఎన్నికల్లో నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక్క రోజు కూడా ప్రచారానికి రాలేదు. పైగా తమకు సంబంధం లేదన్నట్టుగా కామెంట్స్ చేశారు. దాంతో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తనకు సన్నిహితుడైన నల్లగొండలో రైట్ పాలిటిక్స్ పేరుతో యూట్యూబ్ చానల్ నడిపే ఎలికట్టె శంకర్ రావు సాయం తీసుకున్నాడు. ఆయన ద్వారా స్థానిక లీడర్లకు రూ.లక్ష నుంచి రెండు లక్షలు పంపిణీ జరిగేలా చూడాలని మల్లన్న తన అనుచరులను ఆదేశించారు. దాంతో పోలింగ్‌కు ముందు రూ.40లక్షలు మల్లన్న అనుచరులు శంకర్‌రావుకు తెచ్చి ఇచ్చినట్టు తెలిసింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి తెలియకుండానే పలువురు కౌన్సిలర్లు, నేతలకు యూట్యూబర్ కొంత డబ్బును పంపిణీ చేసినట్టు సమాచారం. కొందరికి డబ్బులు రావడం, మరికొందరికి రాకపోవడంతో ఆ పార్టీలోనే పోలింగ్ సందర్భంగా రచ్చ మొదలైంది. కొందరు కాంగ్రెస్ కౌన్సిలర్లు నేరుగా తీన్మార్ మల్లన్నను ఈ డబ్బుల పంపిణీపై ప్రశ్నించినట్టు తెలిసింది. రంగంలోకి దిగిన ఆయన అనుచరులు తాము ఇచ్చిన డబ్బులు ఎవరెవరికీ ఇచ్చావో ఒక జాబితా ఇవ్వాలని శంకర్‌రావుపై ఒత్తిడి తెచ్చారు. వీళ్లు చేసిన ఒత్తిడితో ఓ జాబితా బయటకు వచ్చింది. ఈ జాబితాలో పేర్లున్న వారిలో చాలా మంది తమకు అసలు డబ్బే రాలేదని ఆగ్రహం వ్యక్తం చేయడం వివాదాస్పదంగా మారింది. దాంతో తీన్మార్ మల్లన్న అనుచరులు తమ డబ్బు వాపస్ చేయాలని శంకర్‌రావుపై ఒత్తిడి తెచ్చారు. పలుమార్లు ఇంటికి వెళ్లి బెదిరించినట్టు తెలిసింది. ఇదే సమయంలో జాబితాలో పేర్లు ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్లు తమకు డబ్బు ఇవ్వకుండానే బదనాం చేస్తున్న శంకర్‌రావుపై చర్యలు తీసుకోవాలని నల్లగొండ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు శంకర్‌రావును విచారణకు పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ కౌన్సిలర్లతో పాటు తీన్మార్ మల్లన్న అనుచరులు కూడా స్టేషన్‌కు చేరుకున్నారు. ఇరువర్గాలు వాదోపవాదనలు చేసుకుంటుండడంతో పోలీసులు వీరిని బయటకు పంపించినట్టు తెలిసింది. ఈ వివాదం మరింత రచ్చకు దారి తీయకుండా మున్సిపల్ చైర్మన్, మరో నేత ప్రవేశించి పంచాయితీని కొలిక్కి తెచ్చినట్టు సమాచారం. చివరకు పంచకుండా మిగిలిన డబ్బును త్వరలోనే సర్దుబాటు చేస్తానని శంకర్‌రావు ఒప్పుకోవడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగినట్టు కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలిసింది. ఎన్నికల్లో పంపిణీ కోసం డబ్బును అందజేయడమే నేరం కాగా ఏకంగా తాము ఇచ్చిన డబ్బు పంచలేదని తీన్మార్ మల్లన్న అనుచరులు రచ్చకెక్కడం కలకలం రేపుతున్నది.

స్టేషన్‌లోనే సెటిల్‌మెంట్

నల్లగొండ టూటౌన్ పీఎస్‌లో సోమవారం పైసల పంచాయితీ సెటిల్‌మెంట్ అయినట్టు తెలిసింది. స్టేషన్‌లో ఈ పంచాయితీ జరుగుతున్న సమయంలో చిత్రీకరించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. వీడియో క్లిప్పుల్లో...తాము అందజేసిన రూ.40లక్షల గురించి శంకర్‌రావును తీన్మార్ మల్లన్న అనుచరులు ప్రశ్నిస్తున్నట్టుగా దృశ్య